సాక్షి ప్రకాశం

సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



అడ్డగోలుగా తవ్వేస్తూ..

కనిగిరిలో యథేచ్ఛగా మట్టి దోపిడీ జరుగుతోంది. శివారు ప్రాంతాల్లో, చెరువుల్లో అక్రమార్కులు మట్టి తవ్వి తరలిస్తున్నారు.

- 8లో..



బడుగుల పిల్లలకు విద్య దూరం

కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేస్తోందని యూటీఎఫ్ నాయకులు ధ్వజమెత్తారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34 /26

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.



గంగ ఒడికి గణపయ్య

వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఐదు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథుడు గంగ ఒడికి చేరాడు. ఆదివారం సెలవు రోజు కావడంతో పిల్లా, పెద్దా అందరూ ఉత్సాహంగా నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. వందలాదిగా తరలివచ్చిన గణనాథుని విగ్రహాలతో జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలన్నీ కోలాహలంగా మారాయి. జయజయ ధ్వానాలతో బాణసంచా కాల్చుతూ, రంగులు చల్లుకుంటూ, ఆటపాటలతో ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కలలో మొత్తం 498 విగ్రహాలను నిమజ్జనం చేశారు. - సాక్షి, ఒంగోలు

కొత్తపట్నం సముద్రతీరంలో నిమజ్జనం కోసం బారులుతీరిన గణనాథుని ప్రతిమలు







భక్తజన సంద్రం: కొత్తపట్నం సముద్ర తీరంలో భక్తుల కోలాహలం

న్యూస్‌రీల్

ఈనెల 30 వరకు 30 పోలీసు యాక్ట్


ఒంగోలు టౌన్: శాంతి భద్రతల్లో భాగంగా నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఒంగోలు నగరంలో 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంఘాలు, కార్మిక యూనియన్లు, రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలి

- ఏపీ టీచర్స్‌గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ: జిల్లాలోని 15 ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు, ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. యర్రగొండపాలెం డీఎం బీసీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 8 మంది, నల్లగుంట ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో 4, గిద్దలూరులోని వివేకానంద ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 5, ఎస్పీజీ, సీసీ ఎయిడెడ్ పాఠశాలలో 6, మార్కాపురంలోని శారద ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 3, ఒంగోలులోని సమావేశం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఒకరు, హిందూ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, జీవీఎస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 6, కంభం శ్రీ శ్రీనివాస ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 6, దొనకొండ ఇందిరాగాంధీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 2, పమిడిపాడు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, ఇడుపులపాడు వీపీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 3, అర్ధవీడు ఎస్ఎస్ఆర్ఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 2, పీవీఎస్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల్లో పై ఉపాధ్యాయులతో పాటు ఇతర మండలాల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగంలో తీసుకొస్తున్న నూతన విధానాల వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే క్లస్టర్ విధానం, పాఠశాలల విలీనం పై విద్యార్థులు, ఉపాధ్యాయులు చాలా గుర్రుగా ఉన్నారు. తాజాగా పరీక్షల్లో అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ల విధానం వారిని అయోమయానికి గురిచేస్తోంది. మూల్యాంకన భారం గురువులపై పడుతుండగా, తరగతి గదిలో పాఠ్యాంశాల బోధనపై తీవ్ర ప్రభావం చూపే ఈ విధానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.



టీచర్లపై మూల్యాంకన భారం

- అసెస్‌మెంట్ బుక్‌లెట్లతో ఉపాధ్యాయులకు అవస్థలు
- పాత విధానాన్నే కొనసాగించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్
- సిలబస్ సకాలంలో పూర్తి చేయలేమంటున్న టీచర్లు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

జిల్లాలో మొత్తం పాఠశాలలు:	3102
మొత్తం విద్యార్థులు:	2,10,929
బేసిక్ ప్రైమరీ పాఠశాలలు:	1488
మోడల్ ప్రైమరీ పాఠశాలలు:	713
ఫౌండేషన్ పాఠశాలలు:	351
ప్రాథమికోన్నత పాఠశాలలు:	92
ఉన్నత పాఠశాలలు:	387
హైస్కూల్, బీపీఎస్:	55
హైస్కూల్ ఎమ్‌పీఎస్:	16

ఒంగోలు సిటీ:

కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలతో ఉపాధ్యాయులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. నూతనంగా తెచ్చిన అసెస్‌మెంట్ బుక్‌లెట్ల విధానం వల్ల టీచర్లపై మరింత భారం పడుతోంది. ఈ పరీక్షలు ఉపాధ్యాయులకా లేక విద్యార్థులకా అంటూ ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో పరీక్షల సమయంలో కాగితాలపై జవాబులు రాస్తే ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లి పేపర్లు దిద్ది మార్కులు నమోదు చేసేవారు. ఇప్పుడు కొత్తగా మూల్యాంకన పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 3107 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో బేసిక్ ప్రైమరీ స్కూల్స్ 1488, మోడల్ ప్రైమరీ స్కూల్స్ 713, పౌండేషన్ స్కూల్స్ 351, ప్రాథమికోన్నత పాఠశాలలు 92, ఉన్నత పాఠశాలలు 387, హైస్కూల్, బీపీఎస్ 55, హైస్కూల్ ఎమ్.పి.ఎస్ 16 పాఠశాలలున్నాయి. ఇందులో 2,10,929 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థి అభ్యసన సామర్థ్యం మదింపు కోసం ఏటా ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను గతేడాది నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపరు 1, 2, 3, 4 గా నిర్ణయించారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, 2 సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. మొదటి పరీక్ష ఆగస్టు 11న నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. జూన్, జులై సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల సామర్థ్యాలపై పరీక్షలు పెట్టారు.

ఏడాదంతా బుక్‌లెట్‌లతోనే..

సర్కార్ బడుల్లో నిర్వహించే త్రైమాసిక, అర్ధ వార్షిక పరీక్షలను ఎఫ్–1,2,3,4 గా, ఎస్ఏ–1,2 లుగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను విద్యార్థులు మూల్యాంకన పుస్తకాల్లో రాసేందుకు వీలుగా 1, 2 తరగతులకు మూడు పుస్తకాలు, 3, 4, 5 తరగతులకు నాలుగు పుస్తకాలు చొప్పున, 6, 7 తరగతులకు ఆరు పుస్తకాలు, 8, 9, 10 తరగతులకు ఏడు పుస్తకాలు చొప్పున అందజేశారు. ఏడాదిలో జరిగే అన్ని పరీక్షల వివరాలను ఈ మూల్యాంకన పుస్తకంలో నమోదు చేసేందుకు ఏడాదంతా ఈ పుస్తకాన్ని ఉపాధ్యాయులు భద్రంగా ఉంచాలి. అయితే గతంలో పరీక్షలు తెల్లకాగితాలపై రాస్తే ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేసేవారు. మార్కుల నమోదుతో పూర్తయ్యేది. ప్రస్తుతం విద్యార్థులు మూల్యాంకన పుస్తకాల్లో పరీక్షలు రాస్తున్నారు. ఆ పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లే పరిస్థితి లేక పాఠశాలలోనే ఉంచి జవాబులు మూల్యాంకనం చేసి మార్కులు వేయాల్సి వస్తోంది. దీనివల్ల తరగతి గదిలో సమయమంతా అసెస్‌మెంట్ బుక్‌లెట్లు దిద్దడానికే సరిపోతుందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఒకే బుక్‌లెట్‌లో పరీక్షలు రాయాల్సి రావడంతో త్రైమాసిక పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు అర్ధ సంవత్సర పరీక్షల్లో కూడా ఇస్తే..విద్యార్థులు గతంలో తాము రాసిన సమాధానాలను తిరిగి చూసి రాసుకునే అవకాశం ఉంటుందని, ఇదెక్కడి అసంబద్ధ నిర్ణయమంటూ టీచర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని మూల్యాంకనం:

ఎఫ్ఏ–1 పరీక్షలను ఆగస్టు 11 నుంచి 14 వరకు నిర్వహించారు. ఈ పరీక్షలకు ముందురోజు అసెస్‌మెంట్ బుక్‌లెట్ ఇవ్వడంతో వాటిపై విద్యార్థుల వివరాలను నింపడంలో ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. పరీక్షలు పూర్తై రెండు వారాలైనా ఇప్పటికీ మూల్యంకనం పూర్తి కాలేదు. ఈ ప్రక్రియ తమ బోధనకు ఆటంకంగా పరిణమించిందంటూ టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమయమంతా జవాబు పత్రాల మూల్యాంకనానికే సరిపోతే పాఠాలు ఎప్పుడు బోధించాలని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలురకాల యాప్‌లతో సమయం లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్ష విధానం పాత పద్ధతిలోనే కొనసాగించాలి



రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన అసెస్‌మెంట్ విధానాన్ని వెంటనే తొలగించి పాత పద్ధతిలోనే పరీక్ష విధానం కొనసాగించాలి. బోధనేతర పనులను ఉపాధ్యాయులకు ఎక్కువగా కేటాయించడంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోంది. అసెస్‌మెంట్ విధానం వల్ల సిలబస్ పూర్తికాక విద్యార్థులు నష్టపోతున్నారు.

– శ్రీనివాసులు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

బోధనకు దూరం చేసేందుకే పరీక్ష విధానంలో మార్పులు



ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేందుకే పరీక్ష విధానంలో మార్పులు చేపట్టి, బుక్‌లెట్ అసెస్‌మెంట్ పరీక్ష విధానాన్ని తీసుకొచ్చినట్లుంది. ప్రతీరోజూ ఏదో ఒక సమాచారం విద్యాశాఖ అత్యవసరమంటూ యాప్‌లలో అప్లోడ్ చేయమనడం, విద్యా కిట్లు పంపిణీ అప్లోడ్ చేయాలంటూ ఒత్తిడి, యాప్‌ల భారం తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేక సమాచారాలు పెట్టమంటున్నారు. కింది స్థాయి అధికారుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం. విద్యార్థులకు అందజేసిన అసెస్మెంట్ పుస్తకాల్లో విద్యార్థుల కన్నా ఉపాధ్యాయులకే ఎక్కువ రాతపని ఉండేలా తయారు చేశారు. వందల మంది విద్యార్థులు ఉన్నచోట ఒక ఉపాధ్యాయుడు ఇలాంటి కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో అర్థం కాని గందరగోళ పరిస్థితుల్లో ఉపాధ్యాయులు పూర్తిగా బోధనకు దూరమవుతున్నారు. పరీక్షలు విద్యార్థులు రాస్తున్నారా? ఉపాధ్యాయులు రాస్తున్నారా? అన్న ప్రశ్న నేడు పాఠశాలల్లో నెలకొని ఉంది. అసంబద్ధ నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలను ప్రయోగశాలలుగా మార్చడం సరికాదు. పరీక్ష విధానం పాత పద్ధతిలోనే కొనసాగించాలి.

– షేక్ అబ్దుల్ హై, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

విద్యుత్ లైన్ ఏర్పాటు అడ్డగింత

- రైతులకు తెలియకుండా పొలాల్లో విద్యుత్ లైన్ ఏర్పాటు
- కాంట్రాక్టర్‌పై మండిపడిన రైతులు



గిద్దలూరు ఏఈ, కాంట్రాక్టర్‌పై ధ్వజమెత్తుతున్న రైతులు

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడులో రైతుల పొలాల్లో నుంచి అక్రమంగా ఇండస్ట్రియల్ అవసరాల కోసం లాగుతున్న విద్యుత్ లైన్‌ను రైతులు అడ్డుకున్న సంఘటన ఆదివారం జరిగింది. కొమరోలు మండలం ముత్తరాసుపల్లెలో ఒకరు మొక్కజొన్న ఇండస్ట్రీ ఏర్పాటు చేసుకున్నారు. అందు కోసం బేస్తవారిపేట మండలం పెంచికలపాడు నుంచి హైవేరోడ్డు వెంట ఎంతో విలువైన రైతుల పొలాల్లోంచి విద్యుత్ స్తంభాలు వేసి, మొక్కజొన్న పంటను జేసీబీలతో తొక్కించి విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విద్యుత్ లైన్ ఎలా ఏర్పాటు చేస్తున్నారని కాంట్రాక్టర్‌ను ఆదివారం రైతులు నిలదీశారు. ఇప్పటికే ఈ పొలాల గుండా హైటెన్షన్ విద్యుత్ లైన్ వెళ్తోంది. ఇప్పుడు మరో విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తే విలువైన తమ పొలాలు ఎందుకూ పనికిరాకుండా పోతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు ఎంత నగదు చెల్లించారు, విద్యుత్‌శాఖ అధికారులు ఎస్టిమేషన్ ఎంత వేశారు? అగ్రిమెంట్ ఎవరికి ఇచ్చారంటూ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతానికి మా వద్ద ఏమీ లేవని, రేపు డిపార్ట్‌మెంట్ వాళ్లు తీసుకొస్తారని సమాధానమిచ్చాడు. పనులు జరిగే ప్రదేశం వద్ద గిద్దలూరు ఏఈ ఉన్నారు. కొమరోలు, బేస్తవారిపేట మండలాల పరిధిలో పని జరుగుతున్నప్పుడు గిద్దలూరు ఏఈ ఇక్కడ ఉండి పనులు చేయిస్తుండటంపై రైతులు నిలదీశారు. ఇక్కడెందుకు ఉన్నారని నిలదీయడంతో దారిలో పోతూ నిలబడ్డానని చెప్పడంతో మండిపడ్డారు.



రైతు పొలంలో వేసిన విద్యుత్ స్తంభాలు



స్తంభాలు వేసేటప్పుడు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంట

మోసం చేయడమే బాబు నైజం

- తీసేసిన పింఛన్లన్నీ తిరిగివ్వాలి
- సూపర్ సిక్స్ అట్టర్ ఫ్లాప్
- మహిళలకు నెలకు ఇస్తామన్న రూ.1500 ఎక్కడ..?
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



క్యూఆర్ కోడ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, మహిళలు

దర్శి: అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి, అవి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసగించడమే బాబు నైజమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని కొత్తవెంకటాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆదివారం బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని బూచేపల్లి వెంకాయమ్మకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు హయాంలో మహిళలకు జరిగిన అన్యాయం గురించి క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డుల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు 143 హామీలు ఇచ్చారని, అందులో ప్రధానంగా సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నరైనా ఇప్పటికీ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. పింఛన్‌లు పెంచుతున్నామని చెప్పి ఉన్న పింఛన్‌లు ఊడపీకి వికలాంగుల నోళ్లు కొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో 3780 పింఛన్‌లు తీసేశారని చెప్పారు. దర్శి నియోజకవర్గంలో 579 పింఛన్లు తొలగించారని, తీసేసిన వారికి గతంలో 90 శాతం వికలాంగత్వం ఉండి పింఛన్లు తీసుకుంటున్నా 40 శాతం లోపు మాత్రమే ఉందని నోటీసులు పంపారన్నారు. కొత్త పింఛన్‌లు ఇవ్వకపోగా ఉన్న పింఛన్లు తీసేసి దివ్యాంగుల కడుపు కొట్టడం దారుణంగా ఉందన్నారు. అవయవాల లోపంతో బాధపడుతున్న వారిపై కరుణ చూపాలి కానీ కక్ష సాధింపు చేయడం ఒక్క కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తీసేసిన పింఛన్లన్నీ దివ్యాంగులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని దారుణంగా మోసం చేశారన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన ఆరు హామీలకే దిక్కు లేదని, ఇక చంద్రబాబు ఇచ్చిన 143 హామీలు పై ప్రజలు ఆశలు వదులుకున్నారన్నారు. కూటమికి ఓట్లెందుకు వేశామా అని మహిళలు బాధపడుతున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ గ్రామంలో చూసినా నాలుగైదుకు పైగా బెల్టు షాపులు ఉన్నాయని, గ్రామాల్లో విచ్చలవిడిగా నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. మద్యం మాఫియాకు అండగా ఉండి ఒక్కో బాటిల్‌కు రూ.50 ఎక్కువ వసూళ్లు చేయిస్తూ బెల్టు షాపులు నిర్వహిస్తున్న డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయో ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబు ఒక్క హామీ పూర్తిగా అమలు చేయకుండా రూ.2 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమవుతుందని ఆయన్ను మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ వింగ్ ప్రధాన కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ సోముదుర్గారెడ్డి, ఐదో వార్డు కౌన్సిలర్ తుళ్లూరి బాబురావు, మాజీ సర్పంచ్ మానికొండ వెంకయ్య, బాదం వెంకటరెడ్డి, జింకల అంజిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

● ఎస్పీ ఏఆర్ దామోదర్



పోలీసు గణేష్ విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: గణేష్ నిమజ్జనాలను ప్రశాంత వాతావరణంలో ఉత్సాహంగా జరుపుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. భద్రత దృష్ట్యా భక్తులు తగిన జాగ్రతలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్ వద్ద ఉభభ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీసు గణనాథుడు విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం నిమజ్జన ఊరేగింపును ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులు, కమిటీ ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటిలోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి విగ్రహాలను తీసుకొని వెళ్లరాదని స్పష్టం చేశారు. ఈత రానివారు ఎట్టి పరిస్థితులలోనూ నీటిలోకి దిగవద్దని సూచించారు. మద్యం తాగి నిమజ్జనంలో పాల్గొనవద్దన్నారు. విగ్రహాల ఊరేగింపు సజావుగా కొనసాగేందుకు పోలీసు పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసులకు సమాచారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామి రెడ్డి, ఆర్ఎస్సైలు ప్రసాద్, మాల్యాద్రి, తిరుపతి స్వామి పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

● ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

కంభం: ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన మండలంలోని చిన్నకంభం సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..మండలంలోని నల్లకాల్వ గ్రామానికి చెందిన పెద్దిబోయిన చిన్నకాశయ్య(32) ఆదివారం రాత్రి కంభం నుంచి నల్లకాల్వకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జేబీకేపురం రైల్వేగేటు దాటిన తర్వాత వరినారు కోసం వెళ్తున్న వంగపాడుకు చెందిన పసుపుల చెన్నయ్య ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదానికి గురైన ఇద్దరిని 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చిన్నకాశయ్య అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మరో ద్విచక్రవాహనం ఉన్న పసుపుల చెన్నయ్యకు కాళ్లకు, చేతులకు ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కాగా వైద్యశాలలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలించారు. కంభం పోలీసులు వైద్యశాలకు చేరుకొని వివరాలు సేకరించారు.



చిన్నకాశయ్య మృతదేహం







నిమజ్జనానికి గణనాథుని విగ్రహాలను తరలిస్తూ...



గణనాథుని విగ్రహానికి తీరంలో పూజలు



మళ్లీ రావయ్యా..మూషికరాజా..

వెళ్లిరావయ్యా విఘ్ననాయకా..

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఐదు రోజుల పాటు పూజలందుకున్న విఘ్నేశ్వరుడు భక్తుల కోలాహలం నడుమ గంగ ఒడికి చేరాడు. ఐదో రోజు ఆదివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. కొత్తపట్నంలో సుమారు 500కు పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వినాయక ఊరేగింపుతో సందడి వాతావరణం నెలకొంది. డీజేలు, దప్పులకు యువత నృత్యాలు చేస్తూ నిమజ్జనోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

– సాక్షి, ఒంగోలు



నిమజ్జనోత్సవం..ఉరిమే ఉత్సాహం..



తీరంలో సందడే..సందడి



గంగ ఒడికి చేరుతున్న గణనాథులు



బై..బై..గణేషా...



భక్తజనసంద్రంగా కొత్తపట్నం సముద్రతీరం

సారూ..సదా వారి సేవలో..!



మాగుటూరులో టీడీపీ నాయకుల గ్రామోత్సవంలో బాణసంచా కాలుస్తున్న దృశ్యం (ఫైల్)



ఎస్సై తీరుకు నిరసనగా ప్లేట్లు, డబ్బాలతో డప్పు కొడుతూ నిమజ్జనంలో పాల్గొన్న గ్రామస్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గణేష్ నిమజ్జన వేడుకలకు అనుమతి ఇవ్వడంతో పోలీసుల 'పచ్చ'పాత వ్యవహార శైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే..అర్ధవీడు మండలంలోని మాగుటూరు గ్రామంలో వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి కోసం గ్రామస్తులు ఎస్సై సుదర్శన్‌యాదవ్‌కు దరఖాస్తు పెట్టుకున్నారు. ఎస్సై మాత్రం అనుమతులు ఇవ్వకుండా నిమజ్జనాన్ని ఎటువంటి హంగు, ఆర్భాటాలు, డీజేలు లేకుండా గ్రామంలోకి రాకుండా బయట నుంచే వెళ్లి నిమజ్జనం చేసుకోండని చెప్పాడు. ఇదే సమయంలో అధికార పార్టీ నేతలు ఏర్పాటు చేసిన విగ్రహాలు ఎటువంటి అనుమతులు లేకుండా డీజేలు, బాణసంచా కాలుస్తూ, పాటలతో వెళ్లారు. పోలీసులు మాత్రం వారిని పట్టించుకోవడం లేదు. దీంతో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులు ఆదివారం నిమజ్జనం సందర్భంగా ఎస్సై తీరును నిరసిస్తూ ఆగ్రహంతో మహిళలు, యువకులు, స్థానికులు భోజనం ప్లేట్లు, డబ్బాలు, నీళ్ల డ్రమ్ములతో డప్పులు కొడుతూ నల్లరిబ్బన్లు తలకు కట్టుకొని నిరసన తెలియజేశారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితులు లేవని, ఎస్సై అధికార పార్టీ మెప్పు పొందేందుకు ఈ విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివాదంగా ఎస్సై తీరు..

అర్ధవీడు ఎస్సైగా సుదర్శన్ యాదవ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన తీరు వివాదాస్పదంగా ఉంది. అధికార పార్టీ నాయకులు చెప్పిన ఆదేశాలను పాటిస్తూ వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని పలువురు వాపోతున్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లిలో వినాయకచవితి పండుగ సందర్భంగా వైఎస్సార్ సీపీ అభిమానులు జగన్ పాటలు పెట్టారని అధికార పార్టీ నాయకులు చెప్పారని ఐదారు మందిని రెండు రోజులు స్టేషన్‌కు పిలిపించారని వారిపై ఎస్టీ కేసు పెట్టేందుకు చూస్తున్నట్లు సమాచారం. ఏదైనా గొడవలు జరిగి స్టేషన్‌కు వెళ్లాలన్నా వైఎస్సార్‌సీపీ శ్రేణులు భయపడేలా ఎస్సై తీరు ఉందని, అన్యాయం జరిగిన వారికి కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే ఎస్సై న్యాయం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

టీడీపీ, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ

● పోలీసుల రాజీ యత్నం



సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన టీడీపీ సానుభూతిపరులు

సింగరాయకొండ: వినాయక విగ్రహం వద్ద ప్రసాదం విషయంలో టీడీపీ, బీజేపీ శ్రేణులు ఘర్షణకు దిగారు. ఈ సంఘటన ఆదివారం మండలంలోని కలియవాడ గ్రామం చాకలిపాలెంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..బీజేపీ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కళ్లగుంట సురేష్‌కు, టీడీపీ సానుభూతిపరుడు కె. రవికి మధ్య చాకలిపాలెంలో వినాయక విగ్రహం వద్ద శనివారం రాత్రి గొడవ జరిగి ఇద్దరు ఘర్షణ పడ్డారు. తరువాత అందరూ ఇళ్లకు వెళ్లిన తరువాత సురేష్ టంగుటూరు మండలం నిడమానూరు గ్రామం నుంచి సుమారు 11 మందిని తీసుకువచ్చి లైట్లు ఆర్పి చీకట్లోనే అక్కడే ఉన్న వారిపై కర్రలతో దాడి చేశారు. దాడిలో పలువురికి గాయాలయ్యాయి. దీంతో చాకలిపాలెం వాసులు 30 మంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బీజేపీ నాయకుడు సురేష్‌పై ఫిర్యాదు చేశారు. ఈ లోగా సురేష్..తన పరపతిని ఉపయోగించి పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేశాడు. అయితే టీడీపీ శ్రేణులు మాత్రం దాడి చేసుకున్న వారు ఇద్దరూ బంధువులై ఉండి మా గ్రామంలోకి పక్క గ్రామానికి చెందిన వారిని తీసుకువచ్చి దాడి చేయడం ఏంటని, ఈ ఘటనపై కేసు నమోదు చేయాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో పోలీసులు రాజీ చేస్తారా లేక కేసు కట్టి న్యాయాన్ని కాపాడతారా వేచి చూడాల్సి ఉంది. పోలీసులు మాత్రం కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకులు కావటంతో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. వినాయక విగ్రహాల నేపథ్యంలో మూలగుంటపాడు, పాతసింగరాయకొండ పంచాయతీ గుజ్జుల యలమందారెడ్డి నగర్ మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘటనలకు సంబంధించి ఎటువంటి కేసులు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

బడుగుల పిల్లలకు నాణ్యమైన విద్య దూరం

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు

ఒంగోలు సిటీ: కూటమి ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం ఒంగోలులోని టీటీడీ కళ్యాణ మండపంలో ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రకాశం జిల్లా శాఖ యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాల రంగాన్ని ప్రయోగ కేంద్రంగా మార్చిందని, ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి పాఠశాల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చిందన్నారు. అందులో భాగంగా ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఎక్కువగా వినియోగిస్తూ, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను దూరం చేస్తోందన్నారు. ఉపాధ్యాయులకు ఎక్కువగా సెల్ఫ్ అసెస్‌మెంట్ పేరుతో ఎక్కువ భారం ఉన్న మూల్యాంకన విధానం తీసుకొచ్చిందన్నారు. పాఠశాలలో విద్యాబోధన చేయకుండా... ప్లాంటేషన్, మెగా పీటీఎం, యోగా లీడర్షిప్ ట్రైనింగ్ రకరకాల పనులతో సక్రమంగా పాఠశాల బోధన జరగటం లేదన్నారు. ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక అంశాలు 12వ పీఆర్‌సీ కమిషన్ వేయటం, ఐఆర్ ప్రకటించడం, 11వ పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు, సీపీఎస్ బకాయిలు రకరకాల మొత్తం సుమారు రూ.30 వేల కోట్లు ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సి ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాల మీద ఒక రూట్ మ్యాప్ ప్రకటించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం తీసుకొస్తామని తెలియజేశారు. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, సహాధ్యక్షులు ఐ.వి.రామిరెడ్డి, జి.ఉమా మహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుటుంబ వివాదాలతో వృద్ధురాలిపై దాడి



గాయం చూపుతున్న మస్తాన్‌బీ

పొదిలి: కుటుంబ వివాదాల నేపథ్యంలో వృద్ధురాలిపై దాడి జరిగింది. ఈ సంఘటన పట్టణ పరిధిలోని మసీదురోడ్డులో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే..షేక్ మస్తాన్‌బీ దంపతులకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరిలో ముగ్గురు కుమారులు బయట ఉంటుండగా ఒక కుమారుడు ఖాదర్‌బాషా తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఇటీవల ఆ ఇంటిని వృద్ధ దంపతులు కుమార్తె పేరుపై రాశారు. దీంతో ఆ ఇంట్లో నుంచి కొడుకును వెళ్లిపొమ్మని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబసభ్యుల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. తనకు హక్కు ఉన్న ఇంటిని ఖాళీ చేయనని ఖాదర్‌బాషా ఎదురు తిరగడంతో ఆదివారం కుటుంబసభ్యుల మధ్య జరిగిన గొడవల్లో ఖాదర్‌బీకి గాయాలయ్యాయి. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కౌన్సెలింగ్ ఇస్తానని ఎస్సై వేమన తెలిపారు.

అడ్డగోలుగా తవ్వేస్తూ...అక్రమంగా దోచేస్తూ..

దీపం ఉండగానే చక్క బెట్టుకోవాలన్న చందంగా అధికారాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలు ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. ఏం చేసినా ఎవరేం చేస్తారులే అన్న రీతిలో బరితెగించి బహిరంగంగా మట్టిని దోచేస్తున్నారు. రేయింబవళ్లు తేడా లేకుండా సాగుతున్న ఈ మట్టి దోపిడీలో నెలకు లక్షల్లో చేతులు మారుతున్నాయి. అధికారులకు ఇవన్నీ తెలిసినా ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

- కనిగిరిలో యథేచ్ఛగా మట్టి దోపిడీ..
- చెరువులను తోడేస్తున్న మట్టి మాఫియా..
- అభివృద్ధి పనుల మాటున అక్రమాలు
- పట్టించుకోని అధికారులు
- లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు



బల్లిపల్లి చెరువుల్లో మట్టి తవ్వకాలు



బాల వెంకటాపురం చెరువులో మట్టి తవ్వకాలు

కనిగిరిరూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. కాదేది దోపిడి అనర్హం అన్నట్లు మారింది. ఇసుక, రేషన్, మట్టి ఇలా ఒకటేమి అన్ని రకాలుగా సంపద సృష్టి పేరు అధికార దోపిడీకి పాల్పడుతున్నారు. అరికట్టాల్సిన అధికార యంత్రంగా మాముళ్ల మత్తులో జోగడం.. నిబంధనల సాకుతో అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ పగటి నిద్ర పాటిస్తూ మౌనం దాల్చుతున్నారనే విమర్శలున్నాయి.

యథేచ్ఛగా మట్టి దోపిడీ..

కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, సీఎస్‌పురం, పామూరు మండలాల్లోని శివారు ప్రాంతాల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ప్రధానంగా కనిగిరి మండలంలో జోరుగా చెరువుల్లో మట్టి తవ్వకాలు సాగుతున్నాయి. అధికార పార్టీ నేతల అండతో అక్రమార్కులు చెరువుల్లో, కుంటల్లోని మన్నును జేసీబీలు, పొక్లెయిన్లతో దండిగా దున్నుకుంటున్నారు. ప్రధానంగా కనిగిరి పట్టణంలోని నాగులచెరువును కాంట్రాక్టర్ అవతారమెత్తిన ఓ ద్వితీయ శ్రేణి అధికార పార్టీ రూరల్ నాయకుడు, మరో ఇద్దరు ద్వితీయ శ్రేణి నాయకులు, కనిగిరి పెద్ద చెరువులో రియల్ వ్యాపారంలో పేరు మోసిన ద్వితీయ శ్రేణి అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా దోచుకుంటున్నారు. రాత్రి వేళ గుట్టుగా మట్టిని దోచుకుంటున్నారు. యంత్రాలతో మట్టిని తవ్వుకుంటూ అర్ధరాత్రి దాటిన తర్వాత ట్రాక్టర్లు, టిప్పర్లతో ప్లాటలకు, రోడ్లకు, రియల్ స్థలాలకు మట్టిని తోలుకుంటూ తెల్ల వారిసరికి చెరువు మట్టిపై గ్రానైట్ క్వారీల గ్రావెల్ తోలించి లెవల్ చేస్తున్నారు. ఇటీవల పట్టణ పరిసర ప్రాంతాల్లో జరిగిన పెద్ద రోడ్లకు ఎటువంటి అనుమతులు లేకుండా, నామ్‌కే వాస్తే అనుమతులతో కొందరు నాగుల చెరువుమట్టిని తరలించారు. పునుగోడు, చిన ఇర్లపాడు, వాగుపల్లి, నాగులచెరువులోని మట్టిని కందుకూరు రోడ్డులోని సుమారు 50 ఎకరాల రియల్ భూములకు తరలించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అలాగే కనిగిరి పెద్ద చెరువులోని మట్టిన అధికార పార్టీ నేతలు నామ్‌కే వాస్తే చలానా చెల్లించి అర్ధరాత్రి దాటిన తర్వాత అధికార అండతో ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేసినట్లు తెలిసింది. వారం రోజుల్లో చెరువు సమీపంలో, అలుగు వాగు సమీపంలో వెలిసిన రియల్ భూములకు మట్టిని తోలి రాత్రికి రాత్రే చదును చేస్తుకున్నట్లు తెలిసింది. దీనిపై ఎవరైనా ఫిర్యాదు చేసినా.. ప్రశ్నించినా.. కనిగిరిలో జరుగుతున్న రైల్వే, గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు మట్టి తరిస్తున్నారని చూసి, విచారించి చర్యలు తీసుకుంటామంటూ సమాధానం చెబుతూ అధికారులు జారుకుంటున్నారు. ఈ అక్రమ తంతు ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. సీఎస్‌పురం మండలంలో కనిగిరి రోడ్డులో కొండను ఆనుకుని ఉన్న ప్రాంతంలో మట్టి తవ్వకాలను హైవే రోడ్డు పనుల పేరితో జోరుగా తవ్వకాలు చేస్తున్నారు. అలాగే సీఎస్‌పురం చెరువులోని మట్టిని కూడా తవ్వారు. ఇటీవల వర్షానికి చెరువులో నీరు చేరడంతో తవ్వకాలు ఆపారు. ఏవరైన పేదవాడు ఇళ్లు కట్టుకునేందుకు నాల్గు ట్రాక్టర్లు మట్టి చెరువుల్లో నుంచి తొలుకుంటుంటే.. ఆఘ మేఘాలపై వాలి హడావుడి చేసే పెనాల్టీలు, వాహనాలు సీజ్‌లు చేసే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు అభివృద్ధి పనుల మాటున జరుగుతున్న మట్టి దోపిడిపై ఎందుకు నిఘా పెట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

వారికి సమాచారం లేకుండానే..

అభివృద్ధి పనులకు మట్టి తవ్వకాలకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం ఆ చెరువు పరిధిలో సర్పంచులు, నీటి సంఘం అధ్యక్షులకు కనీస సమాచారం ఇవ్వడం లేదు. మట్టి తవ్వకాలపై ప్రశ్నిస్తే తమపై కక్ష్య సాధింపులు జరుగుతాయన్న భయంతో సర్పంచ్‌లు, తమ పార్టీ వారే తవ్వకుంటుంటే తామెలా ప్రశ్నించాలనే భావనతో నీటి సంఘ అధ్యక్షులు మౌనం దాల్చుతున్నారు.

అభివృద్ధి మాటున..అక్రమంగా తోడేస్తూ

ప్రధానంగా కనిగిరి పట్టణ, మండల ప్రాంతాల్లో జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవే.. నేషనల్ హైవే రోడ్డు పనులు, నడికుడి కాళహస్తి రైల్వే అభివృద్ధి పనులు అధికార పార్టీ నాయకులకు వరంగా మారాయి. అభివృద్ధి పనుల మాటున విస్తృతంగా మట్టి దోపడీకి పాల్పడుతున్నారు. మండంలోని బల్లిపల్లి, బాల వెంకటాపురం, యర్రబల్లి, తమటంవారిపల్లి వాగు, అడ్డ రోడ్డు, పునుగోడు, చిన ఇర్లపాడు, యడవల్లి, దిరిశవంచ చెరువుల్లో, కుంటల్లో, సీఎస్‌పురం శివారు ప్రాంతాల్లో కుంటల్లో యంత్రాలతో జోరుగా మట్టిని తవుతున్నారు. గ్రీన్ ఫీల్డ్, నేషనల్ హైవే రోడ్డు పనులకు, రైల్వే లైన్ పనులకు ప్రభుత్వ, అధికారుల అనుమతితో తవ్వకాలు చేస్తున్నారు. ఏ చెరువులో ఎన్ని క్యూబిక్ మీటర్ల తవ్వకంకు అనుమతి ఉంది.. మట్టిని ఎవరు తవ్వుకుపోతున్నారనే దాన్ని పరిశీలన చేయాల్సిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కనీసం ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో గ్రామాల్లోని టీడీపీ నేతలకు ఇది వరంగా మారింది. ట్రాక్టర్ మట్టిని రూ.800 నుంచి రూ.1000 వరకు, టిప్పర్ మట్టి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు విక్రయిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు.